క్లుప్తంగా

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


దెబ్బతిన్న పైరును పరిశీలిస్తున్న సీపీఎం బృందం

కర్నూలు(సెంట్రల్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ.30 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు. బుధవారం సీపీఎం బృందం దేవనకొండ, ఆస్పరి మండలాల్లో పర్యటించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నట్లు చెప్పారు. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండటంతో పొలాల్లోకి వర్షపు నీరు చేరి టమాట, ఉల్లి పత్తి, వేరుశనగ, మిరప, జొన్న, ఆముదం, కంది పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు చెప్పారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

జిల్లాకు దామోదరం పేరు పెట్టాలి


రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం పాత బస్టాండ్‌లోని చెన్నకేశవస్వామి కల్యాణ మండపంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. హాజరైన సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. దామోదరం సంజీవయ్య జిల్లాగా నామకరణం చేసేంత వరకు ఉద్యమం ఉగదని చెప్పారు. అనంతరం దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా దామోదరం రాధాకృష్ణమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులుగా త్యాగరాజు, రామశేషయ్య, కన్వీనర్‌గా జేవీ కృష్ణయ్యలను ఎన్నుకున్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న అడ్వకేట్ శివరామచంద్రరావు

కర్నూలు సిటీ: డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో బుధవారం పి.సి.ఆర్ చట్టం, ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎఫ్.ఎ.సీ చీఫ్ డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ అడ్వకేట్ శివరామచంద్రరావు పాల్గొని ప్రసంగించారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, ఎస్సీ, ఎస్టీల హక్కులను కాపాడడంలో ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు శాఖ, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులు రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డి పార్టీకి షాక్!

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కేంద్రంగా ఉన్న రాయలసీమ పరిరక్షణ సమితి పార్టీకి ఎన్నికల కమిషన్ షాక్ ఇచ్చింది. 2019లో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రజా పరిరక్షణ సమితి పార్టీని రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటినుంచి దాదాపు ఆరేళ్లుగా ఆ పార్టీ తరఫున ఏ ఎన్నికల్లోనూ అభ్యర్థులు శాసన సభకుగాని, లోక్‌సభకు గానీ, ఇతర ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయలేదు. ఈ క్రమంలో రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి రాయలసీమ పరిరక్షణ సమితి పార్టీని ఎందుకు తొలగించరాదో సెప్టెంబర్ 8వ తేదీన స్వయంగా పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లేదా పార్టీ వ్యవస్థాపకుడు వచ్చి వివరణ ఇవ్వాలని, లేకపోతే పార్టీ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరిస్తూ బుధవారం ఎన్నికల సంఘం నోటీసు ఇచ్చింది.

పార్కును ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 12వ వార్డు పరిధిలోని చాంద్ టాకీస్ పక్కన ఉన్న డబరా గుంత స్థలం ఆక్రమణకు గురి కాకుండా పార్కును ఏర్పాటు చేయాలని సీపీఎం ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ ప్రాంతాన్ని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబరా గుంత స్థలాన్ని కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించుకొని షాపింగ్ మాల్ కట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహ్మద్‌మూస, సిద్ధయ్య, చాంద్‌బాషా, వేణు, దేవసహాయం పాల్గొన్నారు.

నగర సమగ్ర ప్రగతే లక్ష్యం

- మేయర్ బీవై రామయ్య
- రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ ఆమోదం


అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మేయర్, కమిషనర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (టౌన్): నగర సమగ్ర ప్రగతే లక్ష్యంగా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మొత్తం 12 తీర్మానాలకు సంబంధించి రూ.4 కోట్లు విలువ చేసే అభివృద్ధ పనులకు ఆమోదం వ్యక్తం చేశారు. కమిషనర్ పి.విశ్వనాథ్, స్టాండింగ్ కమిటీ సభ్యులు మునెమ్మ, షేక్ అహమ్మద్, నారాయణ రెడ్డి, సాంబశివరావు, వై.వెంకటేశ్వర్లు, అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్‌ఓలు జునీద్, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు

- నగరంలో చెత్తను సేకరించి గార్గేయపురం డంప్ యార్డుకు తరలించేందుకు మూడు నెలల పాటు 10 అద్దె ట్రాక్టర్లను తీసుకునేందుకు రూ.41.86 లక్షలు కేటాయించారు.
- 27వ వార్డు శ్రీరామ కాలనీలో రూ.48.90 లక్షలతో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మూడు కేటగిరీల నాన్- పబ్లిక్ హెల్త్ వర్కర్లకు రూ.3 వేలు చొప్పున వేతన పెంపు నిధులను సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసేందుకు ఆమోదం వ్యక్తం చేశారు.
- 39వ వార్డు అంబేడ్కర్ కాలనీ, సోనియా గాంధీ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రహదారులు, డ్రైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.
- 19వ వార్డు టైపిస్టు కాలనీ, చంద్రశేఖర్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.25 లక్షలు కేటాయించారు.
- 28వ వార్డు లక్ష్మీపురంలో రహదారులు, డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు.
- 26వ వార్డు విఠల్ నగర్‌లో రూ.49.50 లక్షలతో సీసీ రహదారి, డ్రైనేజీ నిర్మాణానికి ఆమోదం వ్యక్తం చేశారు.
- 37వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీ ట్యాంకు నుంచి కోడుమూరు రోడ్డు వరకు పైపులైన్ నిర్మాణానికి రూ.48 లక్షలు కేటాయించారు.
- ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ డిస్‌ప్లేల ఏర్పాటుకు రూ.30 లక్షలు కేటాయించారు.
- నగర సరిహద్దుల్లో స్వాగత ఆర్చీల ఏర్పాటుకు రూ.30 లక్షలు కేటాయిచారు.
- 50వ వార్డు సంకల్‌బాగ్‌లో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.49.95 లక్షలు కేటాయించారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన బుధవారం తన ఛాంబర్‌లో మినిస్టీరియల్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఐవీఆర్ఎస్, సదరం, ఆర్‌టీఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, కోర్టు కేసులు, మెడికల్ రికార్డు సెక్షన్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆస్పత్రికి సంబంధించిన ప్రతి ఫైలు క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ పథకాల అమలు, అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఫీడ్ బ్యాక్ నివేదికల పనితీరుపై సమీక్షిస్తూ ప్రభుత్వ సేవలలో కింది స్థాయి సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అర్జీలను పరిష్కరించడంలో జాప్యం చేసినా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇన్‌చార్జ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి ఏడీ మల్లేశ్వరమ్మ, ఏఓ శ్రీనివాసులు, అకౌంటెంట్ లతీఫ్‌బేగం, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు సీ క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంపు రైతు బజారుకు ఈ నెల 21న సాధారణ సెలవు ప్రకటించినట్లుగా ఎస్టేటు అధికారి కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతుబజారుకు రైతులు, వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉన్నందున పారిశుద్ధ్య లోపం ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే ఒకరోజు సెలవు ఇచ్చి క్లీనింగ్ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. గురువారం రైతుబజారు పనిచేయదని, శుక్రవారం నుంచి యథావిధిగా పనిచేస్తుందని వివరించారు. రైతులు, వినియోగదారులు గమనించాలని సూచించారు.

యూరియాను పక్కదారి పట్టిస్తే కేసులు

కర్నూలు(సెంట్రల్): రైతులకు యూరియా అందకుండా పక్కదారి పట్టించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం సునయన ఆడిటోరియంలో రెవెన్యూ అధికారుల సమావేశంలో యూరియాపై కలెక్టర్ తహసీల్దార్లతో సమీక్షించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు. యూరియాను పక్కదారి పట్టించినట్లుగాని, అధిక ధరలకు అమ్మినట్లుగానీ గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కౌతాళం, పెద్దకడబూరు, హొళగుంద మండలాల్లో ప్రతికల్లో వచ్చిన ప్రతికూల వార్తలపై ఆరా తీయాలని తహసీల్దార్లను ఆదేశించారు.

దోమల ద్వారా మలేరియా వ్యాప్తి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం వల్ల మలేరియా వస్తుందని, ఈ విషయాన్ని కనుగొన్న సర్ రొనాల్డ్ రాస్‌కు నోబుల్ బహుమతి ఇచ్చారని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం స్థానిక ముజఫర్ నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ మేరకు దోమల నియంత్రణ, నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూడాలన్నారు. దోమల వల్ల కలిగే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు, మెదడు వ్యాధి వ్యాపిస్తాయని తెలిపారు. డీఎల్ఏటీఓ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. దోమలు కుట్టకుండా రాత్రివేళల్లో దోమ తెరలు వాడాలని, పొడుగు దుస్తులు ధరించడం, నీరు నిల్వ ఉండకుండా చూడటం, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ మహేశ్వరప్రసాద్, డీఎంఓ నూకరాజు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి

కర్నూలు(సెంట్రల్): సాంకేతిక విప్లవానికి నాంది పలికిన నేత రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ కర్నూలు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా అన్నారు. బుధవారం రాజీవ్‌గాంధీ జయంతి పురస్కరించుకొని కర్నూలు డీసీసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీక్యాంపులోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టు హక్కును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించి యువతీ, యువకులకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన నేత రాజీవ్‌గాంధీ అని, ఆయన సేవలు దేశానికి ఎంతో మేలు చేశాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి


ఏఓ అరుణకు వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏఓ అరుణకు ఏఐవైఎఫ్ నాయకులు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న మాట్లాడుతూ.. కొత్తబస్టాండ్ సమీపంలోని రక్ష హాస్పిటల్‌లో ఇటీవల లింగనిర్ధారణ పరీక్ష చేసి గర్భిణి మృతికి కారణమయ్యారన్నారు. ఘటన జరిగి రెండు వారాలైనా ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అలాగే ఎన్ఆర్ పేటలోని నోబుల్ హాస్పిటల్‌లో మహిళ మృతి చెందితే ఎలాంటి చర్యలూ లేవన్నారు. ఎంహెచ్ హాస్పిటల్‌కు అనుమతి లేకున్నా వైద్య సేవలు అందిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రామాంజిగౌడ్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అభిషేక్, అశోక్ ఉన్నారు.

హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషన్స్ కౌన్సిల్ సెక్రటరీ వారు డిప్లొమా ఎలైడ్ హెల్త్‌కేర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్ పాసైన వారు సెప్టెంబర్ 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ధ్రువ పత్రాలతో తమ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 73311 18019, 76809 45357 సెల్ నంబర్లకు లేదా జొహరాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లోని తమ కళాశాలను సంప్రదించాలన్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో నిర్బంధ తనిఖీలు


వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న పోలీసు అధికారి

కర్నూలు: సమస్యాత్మక ప్రాంతం వీకర్ సెక్షన్ కాలనీలో పోలీసులు నిర్బంధ తనిఖీలు (కార్డెన్ సెర్చ్) చేపట్టారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ నేతృత్వంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు బృందాలుగా ఏర్పడి బుధవారం ఉదయం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీని చుట్టుముట్టి తనిఖీలు నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. మందుగుండు సామగ్రి, మారణాయుధాలు, గంజాయి, మాదక ద్రవ్యాలు వంటివి నిల్వ చేశారా? అనే కోణంలో ప్రతి ఇల్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి నేరచరిత కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, గొడవలు, అల్లర్లకు దిగినా చర్యలు ఉంటాయని రౌడీషీటర్లకు హెచ్చరికలు చేశారు. ఎక్కడైనా, ఎవరైనా గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని కాలనీ ప్రజలకు సూచించారు. అనవసర విషయాల్లో గొడవలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సీఐలు విక్రమసింహా, శ్రీధర్, పార్థసారథి, శేషయ్య, మహేశ్వర రెడ్డితో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

‘నన్నే పిలిచి అవమానిస్తారా’?

కర్నూలు(హాస్పిటల్): ‘ఇంజినీరింగ్ అధికారిగా 32 ఏళ్ల అనుభవం ఉంది. నన్నే అవమానిస్తారా? అంటూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులపై ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చిరంజీవులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న మరమ్మతు పనుల గురించి బుధవారం సూపరింటెండెంట్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఆపరేషన్ థియేటర్ల మరమ్మతులు, ఇతర పనుల గురించి చర్చ జరిగింది. పనులు నత్తనడకన జరుగుతున్నాయని, నాణ్యత కూడా సరిగ్గా లేదని, ఇదే విషయాన్ని తాను ఎండీకి ఫిర్యాదు చేశానని, మీ కంటే డీఈ కరీముల్లా ఈఈగా ఉన్నప్పుడు పనులు బాగా జరిగేవని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈతో పోల్చడంతో ఈఈ చిరంజీవులు అసహనానికి గురైనట్లు తెలిసింది. నా అనుభవం అంత లేదు డీఈ వయస్సు. ఆయన ముందే నన్ను అవమానిస్తారా? నాణ్యత చూడటానికి మా విభాగంలోనే అధికారులు ఉన్నారు, మమ్మల్నే ప్రశ్నిస్తారా? అంటూ ఈఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. దీంతో అవమానంగా భావించిన ఈఈ చిరంజీవులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ విషయం ఆసుపత్రిలో, ఏపీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

24న ‘వివేకానంద’ పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ‘యుగపురుషుడు స్వామి వివేకానంద’ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఓల్డ్‌సిటీ చిదంబరావు వీధిలోని స్వామి వివేకానంద సంస్కృత పాఠశాలలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కే.శే.ఇంద్రకంటి వేంకటేశ్వర్లు రచించిన ఈ పుస్తకాన్ని ఆయన మిత్ర బృందం ఆవిష్కరించేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్వామి వివేకానంద సంస్కృత పాఠశాల కరెస్పాండెంట్, ప్రముఖ న్యాయవాది ఎం.డి.వి. జోగయ్య శర్మ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కొట్టే చెన్నయ్య పుస్తక సమీక్ష చేస్తారని పేర్కొన్నారు.

దివ్యాంగుల కన్నీళ్లు ప్రభుత్వానికి పట్టవా?

- సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): దివ్యాంగులకు ఉన్న ఏకైక జీవనాధారం పింఛన్‌ను కూటమి సర్కార్ నిర్దాక్షిణ్యంగా తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి వాపోయారు. వారి కన్నీళ్లు ప్రభుత్వానికి కనిపించవా? అని ప్రశ్నించారు. బుధవారం స్థానిక సీతారామనగర్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పూర్తి అర్హత కలిగిన వారికి సైతం పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. జీవనాధారమైన పింఛన్ తొలగించడంతో దివ్యాంగులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు దాపురించాయని మండిపడ్డారు. ప్రభుత్వానికి ఆర్థిక భారంగా భావించి ఏదో ఒక సాకులతో పింఛన్లను తొలగిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్లు కోల్పోయిన దివ్యాంగులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు ఉన్నాయని, ప్రభుత్వం వారి ఆగ్రహానికి గురికాక తప్పవద్దన్నారు. కాళ్లు లేవు, కళ్లు లేవు, చేతులూ పనిచేయని వారి పింఛన్లను కూడా తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఇన్ని కుట్రలు చేస్తూ సుపరిపాలన అంటూ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తొలగించిన పింఛన్లను తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సదస్సుకు హాజరైన పట్టుపరిశ్రమ శాఖ సిబ్బంది, అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): సమాచార హక్కు చట్టం ద్వారా పరిపాలనలో పారదర్శకత పెరుగుతుందని పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఆంజనేయులు తెలిపారు. సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో పాటు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005లో సమాచార హక్కు చట్టం వచ్చిందని, అవినీతి, అక్రమాలను నిరోధించేందుకు ఇది ఎంతో తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగాల భర్తీ తదితర అన్నింటిలో సమాచార హక్కు చట్టం కింద సాధారణ ప్రజలకు సమాచారం కోరే హక్కు ఉందని, దీనిని తిరస్కరించే అధికారం లేదని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఉచితంగా, మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించి ప్రజలు సమాచారం కోరవచ్చని వివరించారు. సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి జయన్న మాట్లాడుతూ.. నిర్ణీత గడువు లోపు అడిగిన సమాచారం ఇవ్వకపోతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


వినతి పత్రం అందిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ నగర కార్యదర్శి ఎస్.మహమ్మద్ రఫీ కోరారు. వారు బుధవారం అంగన్‌వాడీ నేతలు బాలదుర్గమ్మ, చౌడేశ్వరిదేవితో కలిసి ఐసీడీఎస్ పీడీ విజయకు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి రాష్ట్రంలో 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. 42 రోజుల చారిత్మాక సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని మినిట్స్ ఇచ్చారని, అయితే ఇంతవరకు అమలు కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయడం లేదని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లకు ఈ ఫోన్లు సపోర్టు చేయడం లేదన్నారు. ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నెట్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. అయితే అధికారులు మాత్రం లబ్ధిదారులకు ఫొటో క్యాప్చర్, ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధనల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతలు మానస, శివమ్మ, రాధికారాణి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టాలి


రిలయన్స్ మార్టుపైన కొలతలు వేస్తున్న మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ అదనపు, డిప్యూటీ కమిషనర్లు ఆర్జీవీ క్రిష్ణ, సతీష్‌కుమార్ రెడ్డి సంయుక్తంగా వెల్లడించారు. బుధవారం స్థానిక నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని రిలయన్స్ మార్ట్, మల్లికార్జున ఫర్నీచర్స్, శకుంతల కళామందిర్, రాజ్‌విహార్ వద్ద ఉన్న క్రోమ్ వాణిజ్య సముదాయాల్లో విస్తీర్ణ కొలతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని అనేక వాణిజ్య గృహాలకు నిర్మాణ విస్తీర్ణానికి ఆస్తి పన్ను తక్కువగా ఉందని, వాటిని మదింపు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నగరంలో ఆస్తి పన్ను పూర్తిగా వసూలు చేస్తే నగరపాలక సంస్థకు అదనంగా మరో రూ.15 కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. ఆర్‌ఓలు జునీద్, వాజిద్, రాజు, ఆడ్మిన్లు పాల్గొన్నారు.

పనితీరు మెరుగు పడకపోతే చర్యలు తప్పవు

పదే పదే చెప్పించుకొవద్దు. పనితీరు మెరుగుపడకపోతే ఉపేక్షించేది లేదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో పట్టణ ప్రణాళిక సిబ్బంది, ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ రియల్టర్లకు ఎల్ఆర్ఎస్ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగి టూర్ బుక్ నిర్వహించాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డీసీపీ వెంకటరమణ పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


ఖైదీలకు అందించే ఆహారాన్ని రుచి చూస్తున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామ శివారులో ఉన్న పురుషుల కారాగారం, ఆర్‌డీఓ కార్యాలయం పక్కనున్న మహిళా జైలును ఆయన బుధవారం తనిఖీ చేశారు. జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసి జైలు ఖైదీలకు అందించే సేవల గురించి వివరించారు. ఇందులో న్యాయవాది, పారా లీగల్ వలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాన్ని అందిస్తారని తెలిపారు. వయసు పైబడిన ఖైదీలకు (70 ఏళ్లు), అనారోగ్యంతో బాధ పడేవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామన్నారు. ఖైదీలకు అందించే ఆహారాన్ని, రేషన్‌ను, వారి ఆరోగ్యంపై తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరుపర్చాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై అవగాహన కల్పించారు. జైలు అధికారులు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ న్యాయవాది శివరాం తదితరులు పాల్గొన్నారు.

బాయ్స్ అబ్జర్వేషన్ హోమ్ తనిఖీ

కర్నూలు సిటీ: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి బుధవారం బిక్యాంపులోని బాయ్స్ అబ్జర్వేషన్ హోమ్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, అందులో ఉన్న పిల్లలతో మాట్లాడారు. అక్కడ ఉన్న ఇద్దరు విద్యార్థుల గురించి అడిగి వారికి న్యాయవాది లేకుంటే ఉచిత న్యాయవాదిని నియమిస్తామన్నారు. బాలలకు సంబంధించిన చట్టాలను, ఉచిత న్యాయ సేవ సహాయాన్ని గురించి వివరించారు. పిల్లలు లీగల్ సర్వీసెస్ యాక్ట్ -1987 ద్వారా ఉచిత న్యాయ సేవ పొందుటకు అర్హులన్నారు. హోమ్ సూపరింటెండెంట్ హుసేన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు బస్సు సర్వీసు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో విజయవాడకు బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు ఏపీటీడీసీ డీవీఎం జి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి కర్నూలు - విజయవాడ రూట్‌లో ప్రతి రోజూ బస్సు సర్వీస్ ఉంటుందని వెల్లడించారు. హైటెక్ నాన్ ఏసీ బస్సు రోజూ రాత్రి 9 గంటలకు వీఆర్ కాలనీలోని హరిత హోటల్ నుంచి బయలు దేరుతుందని, పెద్దలకు రూ.850, పిల్లలకు రూ.680 ఛార్జీ ఉంటుందని తెలిపారు. వివరాలకు 99892 53387, 90101 77055 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): వినాయక చవితి నేపథ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. బంగారుపేట, మౌర్యా ఇన్ రోడ్డు, ఆనంద్ థియేటర్ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని బుధవారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

In The Court of The Principal Senior Civil Judge : Kurnool
I.P.No : 48/2025
Madduri Ravi Teja ..Petitioner
-VS-
Gorantla Padmavathi & 9 others ..Resopondents

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు గ్రామము ప్రజలకు తెలియజేయడమేమనగా పై నంబర్ I.P.లో అర్జీదారు అయిన మద్దూరి రవి తేజ, తండ్రి యం.వి.హుస్సేన్, ఇంటి నంబరు: 90/3-131-1, ఫ్లాట్ నం: 202, సూర్య రెసిడెన్సీ, బాలాజీనగర్, కర్నూలు నగర నివాసి అనునతడు తనను దివాలా దారునిగా తీర్మానించమని దివాలా అర్జీ దాఖలు చేసినాడు. ఇందులో ఎవరికైనా అక్షేపణలు ఉన్న 26.08.2025 తేదిన పగలు 10:30 గం॥లకు పై కోర్టు ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

చెన్నూరు నాగమల్లేశ్వర రెడ్డి
అర్జీదారు తరపు న్యాయవాది, కర్నూలు.
సెల్: 9440655944, 6304248459.